ప్రజాశక్తి
శనివారం ఏప్రిల్ 20 2024 8 పేజీలు
శ్రీకాకుళం

పారదర్శకంగా వ్యయ పరిశీలన (...2లో)

నామినేషన్ వేస్తున్న వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

నామినేషన్ల కోలాహలం

రెండో రోజు 16 మంది దాఖలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం నామినేషన్లు ఊపందుకున్నాయి. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు 16 మంది 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి ముగ్గురు నామినేషన్లు వేశారు. పాతపట్నం, ఆమదాలవలస, టెక్కలిలో ఇద్దరేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాలకు ముగ్గురేసి చొప్పున నామినేషన్లు వేశారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. నరసన్నపేట, ఇచ్ఛాపురంలో రెండో రోజూ ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

శ్రీకాకుళం ఎంపీ స్థానానికి వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ ఆయన వెంట ఉన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి ఇప్పిలి సీతారాజు, పిరమిడ్ పార్టీ అభ్యర్థి బొమ్మాళి తిరుపతిరావు నామినేషన్లు దాఖలు చేశారు.

పలాస అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గౌతు శిరీష, డమ్మీ అభ్యర్థిగా గౌతు శ్యామసుందర శివాజీ నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్ బాబు రెండు సెట్ల నామినేషన్లు చేశారు.

టెక్కలి అసెంబ్లీ స్థానానికి వైసిపి అభ్యర్థి ఎమ్మెల్సీ దువ్వాడ (మిగతా...2లో)

ఎంపీ సీటుపై గురి

- రామ్మోహన్‌నాయుడుని ఓడించడమే లక్ష్యం
- రకరకాల వ్యూహాలను రచిస్తున్న వైసిపి
- క్రాస్ ఓటింగ్ జరగకుండా జాగ్రత్తలు
- టిడిపి అసంతృప్తులపై వల

శ్రీకాకుళం ఎంపీ స్థానాన్ని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని వైసిపి ఉవ్విళ్లూరుతోంది. టిడిపి ఎంపీ రామ్మోహన్ నాయుడి ఓటమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. అందుకనుగుణంగా అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. 2019 ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గానూ ఐదింటిలో విజయం సాధించినా, ఎంపీ స్థానాన్ని మాత్రం కోల్పోయింది. వైసిపి ఓటమిపై అధిష్టానంలో అప్పడే తీవ్ర మథనం సాగింది. క్రాస్ ఓటింగ్ వల్లే ఓడిపోయామని గుర్తించిన పార్టీ పెద్దలు, ఈసారి అటువంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీ స్థానానికి టిడిపి తరుపున సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడే మళ్లీ పోటీ చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్నారు. ఈసారి మాత్రం అంత తేలిగ్గా సీటును వదలకూడదని వైసిపి అధిష్టానం పట్టుదలగా ఉంది. 2014 ఎన్నికల్లో ఓటమి కంటే 2019 ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడమే పార్టీని బాధిస్తోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు గానూ ఐదుచోట్ల అభ్యర్థులు ఘన విజయం సాధించినా ఎంపీ సీటును కోల్పోయింది. నరసన్నపేట, పలాస, పాతపట్నం స్థానాల నుంచి వైసిపి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్‌కు 19 వేలు ఆధిక్యం లభించింది. పలాస నుంచి మత్స్యశాఖ, పశుసంవర్థక మంత్రి సీదిరి అప్పలరాజు 16 వేలకు పైగా ఓట్ల మెజార్టీ రాగా, పాతపట్నం నుంచి విజయం సాధించిన రెడ్డి శాంతి 15 వేల ఓట్ల (మిగతా...2లో)

పేరాడ తిలక్



ఉత్తరాంధ్ర సమస్యలపై పార్టీలు ప్రకటించాలి

మేనిఫెస్టోను విడుదల చేసిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను అమలు చేయడంలో ఈ పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతం మరింతగా వెనక్కి నెట్టబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలపై నిర్దిష్టమైన (మిగతా...2లో)

మేనిఫెస్టోను విడుదల చేస్తున్న వేదిక నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

అసమర్థ పాలనతో అస్తవ్యస్తం

- వైసిపి కనుమరుగు ఖాయం
- ఎంపీ రామ్మోహన్ నాయుడు

(వార్త...2లో)

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఓటును వినియోగించుకోవాలి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. ఓటరు అవగాహనా కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అక్కడే విద్యార్థులు, జిల్లా అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి చేతిలో ఆయుధం ఓటు అని అన్నారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఎన్నికల పర్వం దేశానికి గర్వం అని, మహిళలు, వికలాంగులు, ప్రతిఒక్కరూ ఓటు వేయాలని (మిగతా...2లో)

పనిచేస్తాం... ప్రాధాన్యత ఇవ్వండి

- స్పష్టం చేసిన గుండ అనుచరులు
- సముచిత స్థానం కల్పిస్తాం
- ఎంపీ, కూన హామీ

(2లో)

రూ.1.37 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలు తనిఖీలో భాగంగా రూ.1.37 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని బెండిగేటు వద్ద శుక్రవారం తనిఖీలు చేస్తుండగా విశాఖపట్నం నుంచి పలాసకు వస్తున్న కారును ఆపారు. అందులో తనిఖీలు చేయగా రూ.1.37 లక్షల నగదు ఉంది.

ఈ డబ్బుకు సంబంధించి ఎటువంటి రశీదులు, ఆధారాలు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని తహశీల్దార్ కార్యాలయానికి పంపినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ వనిత (మిగతా...2లో)

పారదర్శకంగా వ్యయ పరిశీలన

శ్రీకాకుళం : ఎన్నికల వ్యయ పరిశీలనను పారదర్శకంగా చేపట్టాలని శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బు, మద్యం వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి బృందాలను కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పుడూ పర్యవేక్షించాలని చెప్పారు. నిఘా బృందాలకు సిసి కెమెరాలు, జిపిఎస్ ట్యాగ్ సిస్టమ్ అమర్చిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సి-విజిల్, 1950 టోల్ ఫ్రీ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీకుంటున్న చర్యల గురించి అడిగారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక పరిశీలన బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నోడల్ అధికారులు సిపిఒ ప్రసన్నలక్ష్మి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, నీటిపారుదల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రేరణ ఉత్సవం

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష అభియాన్ మానటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ, ప్రత్యేక అతిథులుగా జలుమూరు మండల ఎంఇఒ ఎం.వి.ఆర్.ఎస్ ప్రసాదరావు, సరుబుజ్జిలి ఎంఇఒలు డి.బాలరాజు, కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. జిల్లాలోని 30 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఒక విద్యార్థి చొప్పున మొత్తం 60 మంది విజేతలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరికి వ్యాసరచన, డ్రాయింగ్, పద్య రచనల్లో పోటీలు నిర్వహించారు. పోటీలో ఎంపికైన 30 మందికి ఇంటర్వ్యూ నిర్వహించారు. అందులో నుంచి ఒక విద్యార్థి, విద్యార్థినిని ఎంపిక చేసి గుజరాత్‌లోని వాడ్నగర్‌లో ఏడు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన జవహర్ నవోదయ విద్యాలయ, వెన్నెలవలస ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎఎంఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిభ గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యాలయంలో ఇటువంటి ఎంపిక పరీక్ష నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందుకోసం నలుగురు సబ్జెక్టు నిపుణుల ద్వారా పారదర్శకంగా విజేతలను ఎంపిక చేశామని తెలిపారు.

అసమర్థ పాలనతో అస్తవ్యస్తం

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం అతలాకుతలమైందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. మున్సిపాల్టీ పరిధిలోని మూడో వార్డు ఊసవానిపేటలో ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు కూన రవికుమార్, గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పోస్టర్లను పంపిణీ చేసి ఆ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్ర ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న వైసిపి ఈ ఎన్నికల్లో కనుమరుగు కావడం ఖాయమన్నారు. టిడిపి పాలనలో ఆమదాలవలస మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించామని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఎక్కడా తట్టెడు మట్టి కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. టిడిపి, వైసిపి పాలనలో అభివృద్ధిని బేరీజు వేసుకొని ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మెండ దాసునాయుడు, మెట్ట సుజాత, తమ్మినేని చంద్రశేఖర్, గీతా సాగర్, మాజీ కౌన్సిలర్ ఇంజరాపు విశ్వనాథం, బి.వి రమణమూర్తి, బోర గోవిందరావు, లంక నాగరాజు, చాపర సుధాకర్, పుట్రేపు ప్రసాద్, ఇంజరాపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తాం... ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొండు శంకర్ కోసం తామంతా పనిచేస్తామని గుండ దంపతుల అనుకూల నాయకులు స్పష్టం చేశారు. అయితే తమకు గతంలో ఉన్న మాదిరిగానే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం రాత్రి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గుండ కుటుంబంతో పాటు తామూ పార్టీ అభివృద్ధికి దశాబ్దాలుగా పనిచేశామన్నారు. గుండ కుటుంబానికి బాసటగా నిలిచిన తాము టిక్కెట్ విషయంలో కొంత నైరాశ్యానికి గురయ్యామని వివరించారు. అందువల్లే పార్టీ కార్యక్రమాలకు ఇన్నాళ్లు తామంతా దూరంగా ఉన్నామని వివరించారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి శంకర్ విజయం కోసం పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. నాయకత్వ మార్పు నేపథ్యంలో తమ రాజకీయ భవిష్యత్‌కు దెబ్బ తగలకుండా గతంలో చూస్తున్న బాధ్యతల్లో కొనసాగించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో గుండ దంపతులు లేకుండా సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలను శంకర్ విస్మరించే ఆలోచన చేయబోరని స్పష్టం చేశారు.

డివిజన్ ఇన్‌ఛార్జీలు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల్లో టిడిపికి మెజార్టీ తీసుకొచ్చేలా పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు అదే స్థానంలో కొనసాగుతారని హామీనిచ్చారు. గొండు శంకర్‌ను గెలిపించే బాధ్యత ప్రస్తుత నాయకత్వం తీసుకుంటే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు, గెలుపు బాధ్యతలను తాను వహిస్తానని హామీనిచ్చారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కేడర్ అంతా ఏకతాటి పైకి వచ్చి శంకర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. అందరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. ఎటువంటి సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల గౌరవానికి భంగం కలిగించకుండా పనిచేస్తానన్నారు. అధిష్టానం నియమించిన ఇన్‌ఛార్జీలనే కొనసాగిస్తానన్నారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవన్నారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, నాయకులు జల్లు రాజీవ్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, సింతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణ కుమార్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ తీరుతెన్నుల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యాన ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు.

ఎంపీ సీటుపై గురి

ఆధిక్యం సంపాదించారు. ఎంపీ స్థానానికి వచ్చేసరికి అప్పటి ఎంపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కేవలం 6,653 ఓట్ల తేడాతో ఓడిపోయారు. దువ్వాడ ఓటమికి క్రాస్ ఓటింగే ప్రధాన కారణమని గుర్తించిన పార్టీ అధిష్టానం, ఈసారి ఆ తప్పు జరగనీయకుండా చూడాలని గట్టి పట్టుదలగా ఉంది.

క్రాస్ ఓటింగ్ జరగకుండా జాగ్రత్తలు

ఎంపీ స్థానం చేజిక్కించుకోవడంపై దృష్టిసారించిన వైసిపి రకరకాల వ్యూహాలను సిద్ధం చేసింది. అందులో ఇప్పటికే ఒకట్రెండు అమలు చేసింది. అందులో భాగంగా ఎంపీ స్థానానికి పేరాడ తిలక్‌ను, టెక్కలి అసెంబ్లీ సీటుకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను ఖరారు చేసి ఇద్దరూ పరస్పరం సహకరించుకునే పరిస్థితి కల్పించింది. ఇరువురూ కలిసి పనిచేస్తే టెక్కలి నుంచి ఎంపీ అభ్యర్థికి అధిక శాతం ఓట్లు దక్కుతాయని భావిస్తోంది. ప్రతి ఎన్నికల్లో కాళింగ సామాజిక తరగతి ఓట్లు అధిక సంఖ్యలో ఎంపీ రామ్మోహన్ నాయుడుకే పడుతుండడంతో, ఈసారి కూడా అదే సామాజిక తరగతికి చెందిన పేరాడ తిలక్‌ను బరిలో నిలిపింది. గతంలో మాదిరిగా అభ్యర్థిగా నచ్చకో, పార్టీ నచ్చకో టిడిపికి ఓటు వేసే పరిస్థితి వస్తూ ఉంది. ఇప్పుడు దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ కూడా కాళింగ సామాజిక తరగతికి చెందిన వ్యక్తినే అభ్యర్థిగా బరిలో దించడంతో వైసిపిని కాదన్న వారు కాంగ్రెస్ వేస్తారని, తద్వారా తాము గట్టెక్కవచ్చని పార్టీ పెద్దలు అంచనా వేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలోపేతం కోసం అవసరమైతే ఆర్థికసాయం అందించాలని యోచిస్తున్నట్లుగా చర్చ సాగుతోంది.

టిడిపి అసంతృప్తులకు వల

టిక్కెట్ల కేటాయింపు తర్వాత టిడిపిలో నెలకొన్న అసంతృప్తి నేపథ్యంలో అసంతృప్తులపై వైసిపి ప్రత్యేక దృష్టిసారించింది. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణకు టిక్కెట్లు రాకపోవడంతో కేడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసిపి అధిష్టానం భావిస్తోంది. వైసిపిలో చేర్చుకోవడమో, లోపాయికారీగా మద్దతు పలికేలా చూడడం కోసం ప్రయత్నాలు సాగిస్తోంది. పాతపట్నం టిడిపి ఇన్‌ఛార్జి కలమటను పార్టీ పెద్దలు ఇప్పటికే సంప్రదించినట్లు ప్రచారం సాగుతోంది. కలమటతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయించాలని, అందుకు అవసరమైన ఆర్థిసాయం అందించాలని అనుకుంటున్నట్లు తెలిసింది. తద్వారా రెడ్డి శాంతి గెలుపుతో పాటు వైసిపి ఎంపీ అభ్యర్థికీ కొంతమేర ఓట్లు సాధించవచ్చని అనుకుంటున్నారు. ఈ రకంగా అందివచ్చిన అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీ సీటు కైవసానికి వైసిపి చేస్తున్న ప్రయత్నాలు ఎంతమేర ఫలిస్తాయో చూడాల్సి ఉంది.

మొదటి పేజీ తరువాయి

నామినేషన్ల కోలాహలం

శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి నామినేషన్లు వేశారు.

పాతపట్నం అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు, డమ్మీ అభ్యర్థిగా మామిడి సుధిష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.

శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి పి.ప్రసాద్ నామినేషన్ వేశారు.

ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థి కూన రవికుమార్, డమ్మీ అభ్యర్థిగా కూన ప్రమీల రెండు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానానికి వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, డమ్మీ అభ్యర్థిగా గొర్లె ప్రమీల నామినేషన్లు వేశారు. బిఎస్‌పి అభ్యర్థిగా జి.రామారావు నామినేషన్ దాఖలు చేశారు.

ఓటును వినియోగించుకోవాలి

మారుమూల గ్రామాల్లో, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలని చెప్పారు. ఓటర్లు ధైర్యంగా ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరిలో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ, వెంకటేశ్వర, శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య, ప్రతిభ, సన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి క్యాడెట్లు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు కవిత, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి గడ్డెమ్మ, సిపిఒ ప్రసన్నలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతిరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పార్టీలు ప్రకటించాలి

అభివృద్ధి చర్యలు తీసుకునేలా ఎన్నికల్లో పాల్గొంటున్న రాజకీయ కూటములు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల మేనిఫెస్టోను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు విడుదల చేశారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, మెట్రో రైలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం ద్వారా పారిశ్రామికీకరణను తద్వారా ఉద్యోగావకాశాలను అభివృద్ధి చేసేందుకు రాజకీయ పార్టీలు పనిచేయాలని కోరుతూ సవివరమైన ప్రణాళికను విడుదల చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉద్యోగులకు ఒపిఎస్ పెన్షన్, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి ప్రధాన అంశాలను అమలు చేస్తామన్న రాజకీయ శక్తులను బలపరచడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.జి.కె మూర్తి అధ్యక్షత వహించిన సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు, పెన్షనర్ల సంఘం నాయకులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణమూర్తి, కె.శ్రీనివాసు, పి.సుధాకరరావు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో అంశాలు

- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్న సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలి.
- వ్యవసాయాధారిత పరిశ్రమలైన చక్కెర, జ్యూట్ ఫ్యాక్టరీలను తెరిపించి ఉపాధి కల్పించాలి. కొబ్బరి, జీడి రంగాలకు ప్రత్యేక బోర్డుల ద్వారా విస్తరణ అవకాశాలను పెంచాలి.
- ప్రభుత్వంగ పరిశ్రమల పరిరక్షణ, స్టీల్ ఫ్యాక్టరీని నష్టపరిచే నిర్ణయాలు ఆపి, విశాఖ ఉక్కును రక్షించడం.
- పర్యావరణ విధ్వంసం సృష్టించగల కొవ్వాడ అణువిద్యుత్ పరిశ్రమ ఆలోచనను రద్దు చేయడం.
- శ్రీకాకుళం జిల్లాలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయం, రిమ్స్ మెడికల్ కళాశాలలో శాశ్వత నియామకాలు చేపట్టి మౌలిక వసతులు మెరుగుపరచాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించాలి.
- జిల్లా కేంద్రానికి రైలు కనెక్టివిటీ ఇవ్వాలి.

తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకుంటున్న ఫ్లయింగ్ స్క్వాడ్

రూ.1.37 లక్షలు పట్టివేత

తెలిపారు. నగదును సీజ్ చేసి శ్రీకాకుళం ట్రెజరీ కార్యాలయానికి తరలించినట్లు తహశీల్దార్ సురేష్ చెప్పారు. దీనిపై వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఆమదాలవలస : అగ్ని ప్రమాదాల నివారణపై వివరిస్తున్న చక్రధరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పివిఎస్ రామ్మోహన్ ఆస్పత్రి, పాతర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాతర్లపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బందికి, చికిత్స పొందుతున్న రోగులకు అవగాహన కల్పించారు. అలాగే అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి పైల అశోక్, సిబ్బంది ప్రసాద్, సిహెచ్ నాయుడు, డి.వెంకటరావు, ఎ.సురేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి చక్రధరరావు అన్నారు. పట్టణ శివారున ఐకాన్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. అనంతరం ప్రజలకు పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని కాశీబుగ్గ అగ్నిమాపకశాఖ అధికారి బి.సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక కిడ్నీ ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యాధికారులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో ప్రమాదాలు జరిగే సమయంలో వృద్ధులను, బాలింతలను, గర్భిణీలను కాపాడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మంటలు వ్యాపించకుండా ఏవిధంగా చర్యలు తీసుకోవాలో ప్రయోగాత్మకంగా డెమో ఇచ్చారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, యుగంధర్, సంతోష్‌కుమార్, జనార్థనరావు, రాము పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలాస : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు

కొత్తూరు : అగ్నిమాపక వారోత్సవాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో, మెట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అగ్నిమాపక అధికారి బుచ్చోడు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సరోజని (ఫైల్)

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కొత్తగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెంటవూరుకు చెందిన కూర్మాపు సరోజని (48) మృతి చెందింది. తన కుమారుడు రమేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కిందకు జారిపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయమైంది అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు రమేష్‌కు ఈ నెల 24న వివాహం జరగనుంది. వివాహ సామగ్రిని కొనుగోలు చేసేందుకు పలాస వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పెళ్లింట విషాధం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేసుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్‌దేవ్ మహాపాత్రో మృతదేహం

ఇసుక ర్యాంపులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పొట్టకూటి కోసం వచ్చి విగతజీవిగా మారిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని బిర్లంగి వద్ద ఇసుక రవాణా చేస్తుండగా... మట్టి శకలాలు కూలి ఒడిశా రాష్ట్రం జగదల్పూర్‌కు చెందిన బాస్‌దేవ్ మహాపాత్రో (32) మృతి చెందారు. బిర్లంగి వద్ద నిత్యం ట్రాక్టర్ ద్వారా ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుంది. ఇక్కడ పనిచేయడానికి వివిధ ప్రాంతాల నుంచి వలసలుగా వస్తుంటారు. ఒడిశా రాష్ట్రం జగదల్పూర్‌కు చెందిన పాత్రో ఇక్కడకు పనిచేయడానికి వచ్చారు. పనిచేస్తుండగా... మట్టి శకలాలు అతనిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య గాయత్రి మహాపాత్రో, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణ్‌నాగిరెడ్డికేసు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న సిఐ టి.ఇమ్మన్యూనల్‌రాజు మృతదేహాన్నిపరిశీలించారు.

వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని జాతయ రహదారి చిన్నబమ్మిడి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కొనారి దండాసికు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నబమ్మిడికి చెందిన దండాసి బహిర్భూమికి వెళ్లి రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో కోటబొమ్మాళి నుంచి నరసన్నపేట వైపు వెలుతున్న లారీ ఢీకొనడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రచార రథంపై దాడి

టెక్కలి : టెక్కలి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కిల్లి కృపారాణి ప్రచార రథంపై శుక్రవారం సాయంత్రం దాడి జరిగింది. స్థానిక తొలిసూరుపల్లి రోడ్డు కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆటో వస్తుండగా... గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఆటోపై కర్రతో దాడి చేశారు. ఈ దాడిలో కృపారాణికి చెందిన ఫ్లెక్సీలు చిరిగిపోయాయి. ఆటోడ్రైవర్ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు

చిరిగిపోయిన ఫ్లెక్సీ

వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- రణస్థలం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో మండలంలోని పైడిభీమవరం, కొష్ట, రామతీర్థం జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారిలో సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనచోదకులు రవాణాశాఖ అధికారులు, పోలీసుల నిబంధనల మేరకు అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

నామినేషన్ పత్రాలను ఆర్‌ఒకు అందజేస్తున్న పరిమళ

కిరణ్‌కుమార్ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి- రణస్థలం

సార్వత్రిక ఎన్నికల నామినేషన్లను శుక్రవారం మండలంలోని పాతర్లపల్లికి చెందిన ప్రస్తుత ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వైసిపి తరపున నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్మణమూర్తి తెలిపారు. అలాగే ఎమ్మెల్యే భార్య గొర్లె పరిమళ వైసిపి నుంచి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బిఎస్‌పి నుంచి ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన గంట్లాన రామారావు నామినేషన్ దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎంజిఆర్ నామినేషన్ దాఖలు

పాతపట్నం: పాతపట్నం ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు శుక్రవారం 12 గంటలకు నామినేషన్‌ను ఎంపీ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయంలో దాఖలు చేశారు. ఎంపీతో గోవిందరావు తన అభ్యత్వాన్ని యాలాది మంది జనసంద్రంలో ఆపిల్ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ వేస్తున్న గోవిందరావు

ఊడిన కాగితాలు... కనిపిస్తున్న చిత్రాలు

సరుబుజ్జిలి : తురకపేటలో శిలాఫలకంపై ఊడిన కాగితం

ప్రజాశక్తి- ఆమదాలవలస

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మార్చి 16న ఎన్నికల సంఘం షెడ్యూలు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, శిలాఫలకాలు కనిపించకుండా మూసి వేయాల్సిన అధికారులు తూతూ మంత్రంగా శిలాఫలకాలను కాగితాలతో మూసివేశారు. నామమాత్రంగా కాగితాలు అంటించడంతో అవి పూర్తిగా ఊడిపోయి ప్రస్తుతం శిలాఫలకాలు యధావిధిగా దర్శనమిస్తున్నాయి. సరుబుజ్జిలి మండలం మూలసవలాపురం పంచాయతీ పరిధిలోని తురకపేటలో స్పీకర్ తమ్మినేని సీతారాం వేసిన శిలాఫలకం కాగితాలు ఊడి ప్రజలకు నేరుగా కనిపిస్తున్నది. అలాగే ఆమదాలవలస మున్సిపాలిటీలోని 15వ వార్డు పరిధిలో మోనింగివారి వీధిలో ఉన్న మున్సిపల్ పారిశుధ్య వాహనాల కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని వేసిన శిలాఫలకం కూడా కాగితాలు పూర్తిగా ఊడి కొత్తగా శిలాఫలకం ఆవిష్కరించిన విధంగా కనిపిస్తోంది. ప్రతిరోజు అధికారులందరూ అదే రహదారిలో ప్రయాణాలు సాగిస్తున్నప్పటికీ ఏ అధికారి ఎన్నికల కోడ్ ఉల్లంఘన పట్టించుకోకుండా వెళ్లడం పట్ల విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

వ్యర్థాలతో తప్పని అవస్థలు

బూర్జ: రోడ్డుపక్కన వ్యర్థాలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో కొల్లివలస గ్రామ సమీపంలో చికెన్ వ్యాపారస్తులు తమ వ్యర్థాలను రహదారికి పక్కన పారవేయడంతో వీటికోసం మూగజీవాలు కొట్లాడడం తద్వారా రహదారి మీదకు రావడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వ్యర్థాలను రోడ్డుపక్కన పారవేయకుండా చర్యలు తీసుకొని ప్రమాదాలు నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన పారబోసిన వ్యర్థాలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

77 గ్రాముల బంగారం, 5 తులాల వెండి స్వాధీనం

ఐదుగురు అరెస్టు

పలాస: రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగుల్లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు దొంగతనం చేసే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను రైల్వే పోలీసులు గుట్టురట్టు చేశారు. 77 గ్రాముల బంగారం, 5 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ పిఆర్‌పి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్సై షరీఫ్ వివరాలు వెల్లడించారు. భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఇంటర్ సిటీలో ప్రయాణం చేస్తూ బీహార్ రాష్ట్రానికి చెందిన రంజిత్ కుమార్ సాహు, నిశాంత్ కుమార్ మండల్, జైలో మండల్, ఉదయ్ కుమార్ మండల్, అనషన్ కుమార్ యాదవ్‌లు పలాస రైల్వే స్టేషన్‌లో దిగారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తుండగా... బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు యువకులు ఫ్లాట్ ఫాంలో అనుమానాస్పదంగా కనిపించారు. వీరి బ్యాగులు తనిఖీ చేసేందుకు వెళ్లగా ఐదుగురు యువకులు తప్పించు కొనేందుకు ప్రయత్నం చేశారు. వీరిని రైల్వే పోలీసు సిబ్బంది చాకచక్యంగా పట్టుకొని వారిని నుంచి 77 గ్రాముల బంగారం 5 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీరు ప్రయాణికుల బ్యాగులను టార్గెట్ చేస్తూ ప్రయాణికులతో మమైకమై బ్యాగులో బంగారం ఆభరణాలను దొంగలించడం చేస్తుంటారని చెప్పారు. గత నెల రోజులు వ్యవధిలో సుమారు రూ.3,39 లక్షలు విలువ చేసే బంగారపు ఆభరణాలు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి విశాఖపట్నం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. సమావేశంలో పలాస రైల్వే పోలీసు సిబ్బంది కోదండరావు, ఎం.సంతోష్ కుమార్, బి.దేవేంద్ర నాథ్, పి.రమేష్‌బాబు, టి.తేజ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మీకు తెలుసా?

వైద్య వృత్తిలో ఉంటూ శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పోటీచేసి గెలిచిన మొదటి వారు డాక్టర్ కణితి విశ్వనాథం. జిల్లా నుంచి పిసిసి అధ్యక్షుడిగా పనిచేసిన మజ్జి తులసీదాసు 1962లో సోంపేట నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా, 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. 1972లో గౌతు లచ్చన్నపై పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి టిడిపి హయాంలో మాజీ మంత్రి తమ్మినేని సీతారాం, కూన రవికుమార్‌లు ఇద్దరూ విప్‌గా వ్యవహరించారు. జిల్లాలో అతిచిన్న వయసులో ఎంపీగా ఎన్నికయ్యారు కింజరాపు రామ్మోహన్ నాయుడు. జిల్లా పరిషత్ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా డాక్టర్ కిమిడి మృణాళిని ఎంపికయ్యారు. మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ 1983లో శ్రీకాకుళం శాసనసభ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంటు అభ్యర్థిగా పోటీచేశారు. అనంతరం 1985లో ఎన్‌టిఆర్ సమక్షంలో టిడిపిలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్‌టిఆర్ హయాంలో కరువు నివారణ మంత్రిగా పనిచేశారు. మజ్జి తులసీదాసు, గౌతు లచ్చన్న, గొర్లె శ్రీరాములునాయుడు, లుకలాపు లక్ష్మణదాసు, చిగిలిపల్లి శ్యామలరావు, తమ్మినేని సీతారాం, గుండ అప్పలసూర్యనారాయణ, కె.ప్రతిభాభారతి, గౌతు శ్యామసుందర శివాజీ, కిమిడి కళా వెంకటరావు, తంగి సత్యనారాయణ, త్రిపురాన వెంకటరత్నం, ధర్మాన ప్రసాదరావు, కోండ్రు మురళీ మోహన్, కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు.

ఎండ ధాటికి... వైసిపి గూటికి

వైసిపి కార్యాలయం వద్ద సేదతీరుతున్న టిడిపి, జనసేన, బిజెపి నాయకులు

ప్రజాశక్తి- పాతపట్నం

ఎండ ధాటికి వైసిపి కార్యాలయానికి టిడిపి కూటమి నాయకులు శుక్రవారం వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. పాతపట్నం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు మిట్ట మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ వేసేందుకు ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు జెండాలు పట్టుకుని పాల్గొన్నారు. నామినేషన్ వేస్తున్న సమయంలో నడినెత్తిన సూర్యుడు ఎండ దంచికొట్టాడు. శరీరంలోని చెమట ధారాలంగా కారిపోతుంది. దీనిని తట్టుకోలేక కార్యకర్తలందరూ పార్టీల జెండాను పక్కన బెట్టేసి నీడ కోసం తమ ప్రత్యర్థి వైసిపి కార్యాలయానికి వెళ్లిపోయారు. తీరా తలపైకెత్తి చూస్తే... తమ ప్రత్యర్థి వైసిపి కార్యాలయం ఉన్నామని తెలుసుకున్నారు. బయటకు ఎండను చూసి ఏ జెండా అయినా, అజెండా అయినా అవసరమైనప్పుడు నాయకులే జెండాలు మార్చేయగా లేనిది... మనకేంటి అంటూ కాస్త సేదతీరారు. ఈ విచిత్రమైన ఘటన పాతపట్నం కూటమి అభ్యర్థి ఎంజిఆర్ నామినేషన్ ర్యాలీలో చోటు చేసుకుంది.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రెడ్డి శాంతి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రతి పేదవాడి ఇంటికీ ప్రభుత్వ పథకం సిఎం జగన్మోహన్‌రెడ్డి అందజేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని వెంకటాపురం, కొత్తూరు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు గమనించాలని కోరారు. మన పాలన మనమే చేసుకునేలా మనకు ఒక అవకాశం కల్పించిన నాయకుడు సిఎం జగన్ అని అన్నారు. ఇంతగొప్ప ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు. ముందుగా ఆయా గ్రామస్తులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడ వసంతకుమారి, బెజ్జి జయమ్మ, పాపారావు ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైసిపి కన్వీనర్ పల్లి యోగి, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, సవర సుభాష్, గణేష్ ప్రధాన్, పెద్దింటి చంద్రరావు, సవర వెంకటేష్, భాస్కరరావు, కరణం శశిభూషణరావు పాల్గొన్నారు.

టిడిపితోనే మంచి రోజులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రచారం చేస్తున్న శంకర్

టిడిపితోనే ప్రజలకు మంచి రోజులు రానున్నాయని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మండలం పెదగనగల్లవాని పేటలో శుక్రవారం సర్పంచ్ బర్రి రామారావు ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారాన్ని మాజీ ఎంపిపి గొండు జగన్నాథరావుతో కలిసి పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించి ఇంటింటా ప్రచారం చేపట్టి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత అయిదేళ్ల పాలనలో సాగిన అరాచకం, నిరంకుశత్వానికి మరికొద్ది రోజుల్లో ముగింపు రానుందన్నారు. పేదలను సుసంపన్నులుగా మార్చేందుకు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టనున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుతోనే మహిళల భవిష్యత్

ప్రచారం చేస్తున్న స్వాతి

శ్రీకాకుళం రూరల్: మహిళల జీవితాలు బాగుపడాలన్నా, వెలుగులు రావాలన్నా చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి అన్నారు. గార మండలం యాళ్లపేట, రాఘవాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ గత ఎన్నికలకు ముందు మహిలకు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని నమ్మించి ఐదేళ్ల పాలనలో విషం చిమ్మె మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. వేలాది మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. నిత్యావసర సరకుల పంపిణీ బియ్యానికే పరిమితం చేశారన్నారు. ఇటువంటి పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో గుండ ప్రభాకర్, యాళ్ల శ్రీరాములు, యాళ్ల ధర్మారావు, గారయ్య, కృష్ణారావు, ఎన్ని సూరిబాబు, సిహెచ్ రమణ, గోవిందరావు పాల్గొన్నారు.

పొలిటికల్ ట్విస్టులకు కేరాఫ్ ఎచ్చెర్ల

ప్రజాశక్తి- రణస్థలం

పొలిటికల్ ట్విస్టులకు కేరాఫ్ ఎచ్చెర్ల నియోజకవర్గం. పొలిటికల్ కాంట్రవర్సీకి లోటు లేదక్కడ. అధికార, ప్రతిపక్షాల్లో గ్రూపులతో నిత్యం హాట్‌హాట్ పాలిటిక్స్ నడిచే ఎచ్చెర్లలో రెండు పార్టీలూ ఊహించలేని ట్విస్టులతో రాజకీయాన్ని మలుపు తిప్పేశాయి. తాము ఒకటి తలస్తే అధినేతలు మరోలా నిర్ణయాలు తీసుకోవడంతో రెండు ప్రధాన పార్టీల్లో కేడర్ గప్‌చుప్ అయిపోయారు. ఇంతకీ ఎచ్చెర్లలో ఏం జరిగింది? శ్రీకాకుళం జిల్లాకు ఆర్థికంగా ఆయువు పట్టు లాంటి ఆ నియోజకవర్గంలో రాజకీయం ఎలా ఉంది?

శ్రీకాకుళం జిల్లాకు గేట్ వేగా చెప్పే ఎచ్చెర్ల నియోజకవర్గం పొలిటికల్‌గా చాలా ఇంట్రస్టింగ్‌గా మారుతోంది. పరిశ్రమలు, విద్యా కేంద్రాలు ఉన్న ఎచ్చెర్లలో ఒకవైపు సుదీర్ఘ సముద్ర తీరం. మరోవైపు పొడవైన జాతీయ రహదారితో జిల్లాలో ఆర్థిక కేంద్రంగా మారింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ట్రిపుల్ ఐటీతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గం జిల్లా కేంద్రం శ్రీకాకుళం పక్కనే ఉంటుంది. నియోజకవర్గం పరిధిలోని రణస్థలం పారిశ్రామిక వాడలో ఎన్నో ఫార్మా పరిశ్రమల వల్ల ఉపాధి కోసం ఇతర ప్రాంతాల వారు వచ్చి స్థిరపడ్డారు. ఒకవైపు ప్రకృతి వనరులు, మరోవైపు విద్య, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గానికి రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉండటంతో పట్టుకోసం ప్రధాన పార్టీలు శతవిధాల ప్రయత్నిస్తుంటాయి.

టిడిపి కంచుకోట..

1967లో ఏర్పడిన ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపికి కంచుకోట. 1983 నుంచి 1999 వరకు జరిగిన ఐదు ఎన్నికల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా వరుస విజయాలు సాధించారు సీనియర్ మహిళా నేత ప్రతిభాభారతి. మంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా సుదీర్ఘ రాజకీయ అనుభవం గడించిన ప్రతిభాభారతి 2004లో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి కొండ్రు మురళీమోహన్ గెలుపొందారు. అంత వరకు ఎస్‌సి రిజర్వు నియోజకవర్గంగా ఉన్న ఎచ్చెర్ల 2009లో జనరల్‌గా మారింది. దీంతో 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన కొండ్రు మురళీమోహన్ రాజాం నియోజకవర్గానికి మారారు. ఇక 2009లో కాంగ్రెస్ గెలవగా, 2014లో టిడిపి, 2019లో వైసిపి గెలిచాయి. ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మరోసారి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, ఆయన ప్రత్యర్థిగా బిజెపి నుంచి నడికుదిటి ఈశ్వరరావు పోటీ పడుతున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాలు ఉన్నాయి. మొత్తం 2,42,918 ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో తూర్పుకాపు సామాజిక తరగతి ఓటర్లు మొదటి స్థానంలో ఉండగా, తెలగ, రెడ్డిక, కళింగ, మత్స్యకారుల సామాజిక తరగతి తరువాతి స్థానాల్లో ఉన్నాయి. గత రెండు ఎన్నికల్లో వైసిపి, టిడిపి మధ్య విజయం దోబూచలాడగా, ఈసారి టిడిపి తప్పుకుని బిజెపికి ఈ నియోజకవర్గం కేటాయించడంతో ఉత్కంఠ రేపుతోంది.

ఎమ్మెల్యేపై తొలుత తీవ్ర వ్యతిరేకత

గత ఎన్నికల్లో వైసిపి తొలిసారి గెలిచిన ఎచ్చెర్ల నియోజకవర్గంలో.. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తొలుత తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇవ్వడం లేదని నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ద్వితీయ శ్రేణి నేతలు, చాలామంది ఎంపిటిసిలు, సర్పంచ్‌లు బహిరంగ విమర్శలు చేసేవారు. ఎమ్మెల్యే కూడా వారిని శాంతపరిచేందుకు ఎన్నివిధాల ప్రయత్నించినా.. ఎవరూ వెనక్కి తగ్గేవారు కాదు. మంత్రి బొత్స సత్యనారాయణకు ప్రధాన అనుచరుడైన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అధిష్టానం అండదండలతో మరోమారు టిక్కెట్ తెచ్చుకున్నారు. అయితే ఇటీవల వైసిపిలో కీలక నేత ఎచ్చెర్ల మండలానికి చెందిన జరుగుళ్ల శంకర్‌పై హత్యాయత్నం జరగడం, ఈ కేసులో నిందితుడిగా ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి అరెస్టు కావడం.. ఎమ్మెల్యేకు మైనస్‌గా మారిందని చెబుతున్నారు.

చల్లారిన అసంతృప్తులు



వాస్తవానికి ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపిల్లో నిన్నమొన్నటి వరకు గ్రూప్‌వార్ తీవ్ర స్థాయిలో ఉండేది. సిట్టింగ్ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కి వ్యతిరేకంగా ద్వితీయశ్రేణి క్యాడర్ అంతా రోడ్డెక్కి ఆందోళనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో టిడిపిలోనూ సీనియర్ నేత కళా వెంకటరావు, ప్రస్తుత విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు తరగతుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అయినే అనూహ్యంగా ఇప్పుడు రెండు పార్టీల్లోనూ అసమ్మతులు, అసంతృప్తులు టీ కప్పులో తుపానులా చల్లారిపోయాయి. ఎన్నికల్లో ఎవరు ఎలాంటి పాత్ర పోషిస్తారోగాని.. ప్రస్తుతానికి అయితే ఇరుపార్టీల్లో తిరుగుబాటుదారులు శాంతించినట్లే కనిపిస్తున్నారు.

ఆశలన్నీ సంక్షేమ పథకాలపైనే..

పార్టీలో చాలామంది నేతలు వ్యతిరేకిస్తున్నా అవన్నీ చిన్నచిన్న సమస్యలని ప్రతి పార్టీలో అలాంటి సమస్యలు ఉంటూనే ఉంటాయని లైట్‌గా తీసుకుంటున్నారు ఎమ్మెల్యే, సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో తనదే గెలుపని తన విజయాన్ని ఆపడానికి ఎన్ని పార్టీలు కూటమి కట్టినా ఉపయోగం లేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఎమ్మెల్యే కిరణ్ కుమార్.

ఎచ్చెర్లను బిజెపికి వదిలేసిన టిడిపి

గ్రూపులు, ఎమ్మెల్యేపై తిరుగుబాట్లతో వైసిపి సతమతమవుతుండగా, టిడిపిలోనూ ఇదే పరిస్థితి ఉండటం, టిక్కెట్ కోసం పోటీ పడుతున్న ఇద్దరు నేతలకు సర్దిచెప్పలేని పరిస్థితుల్లో ఎచ్చెర్లను బిజెపికి వదిలేసింది టిడిపి. వాస్తవానికి ఈ నియోజకవర్గం నుంచి సీనియర్ నేత కళా వెంకటరావుతో పాటు టిడిపి శిక్షణా శిబిరాల కో-ఆర్డినేటర్ కలిశెట్టి అప్పలనాయుడు పోటీచేయాలని భావించారు. సీనియర్ నేత కళా వెంకటరావు 2014లో ఎచ్చెర్ల నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2019లో మరోమారు పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఈ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని కలిశెట్టి పార్టీపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు.

2019 నుంచి నిరంతరం పార్టీ కార్యక్రమాలు చేపట్టారు. దీంతో జిల్లా పార్టీ ఆయనను సస్పెండ్ చేసినా.. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు, యువనేత లోకేష్ అండదండలతో యథేచ్ఛగా నియోజకవర్గంలో పసుపు జెండా పట్టుకునే ప్రచారం చేసేవారు. ఇలా ఇద్దరూ పార్టీపై ఒత్తిడి చేయడం.. ఎవరికి టిక్కెట్ కాదంటే ఏమవుతుందో అనే టెన్షన్‌తో ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని బిజెపికి కేటాయించింది టిడిపి. అంతేకాకుండా టిడిపి టిక్కెట్ కోసం కొట్లాడిన కిమిడి కళావెంకటరావుకు పక్కనే ఉన్న చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్, కలిశెట్టి అప్పలనాయుడికి విజయనగరం పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చేంది. మరోవైపు కళా శిష్యుడైన నడికుదిటి ఈశ్వరరావును బిజెపి అభ్యర్థిగా తెరపైకి తెచ్చింది. దీంతో రెండు తరగతి వారు ఇప్పుడు బిజెపి జెండాను పట్టుకుని కూటమి అభ్యర్థిని గెలిపించాల్సిన పరిస్థితి తలెత్తింది.

అనూహ్యంగా బిజెపి టిక్కెట్ కైవసం

ఇక బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నడికుదిటి ఈశ్వరరావు 2019 వరకు టిడిపిలోనే ఉండేవారు. వృత్తిరీత్యా కాంట్రాక్టర్ అయిన ఈశ్వరరావు 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తన స్వగ్రామం బంటుపల్లి సర్పంచ్‌గా తన తల్లిని గెలిపించుకున్నారు. అంతవరకు రాజకీయాలతో సంబంధంలేని ఈశ్వరరావు తల్లిని సర్పంచ్ చేశాక రణస్థలం మండలంలో రాజకీయంగా క్రియాశీలంగా తిరిగేవారు. ఆ క్రమంలోనే టిడిపి సీనియర్ నాయకులు కళావెంకటరావుకు దగ్గరై 2014లో ఆయన విజయానికి కృషి చేశారు. 2019లో టిడిపి ఓటమి పాలు కావడంతో తర్వాత బిజెపిలో చేరి అనూహ్యంగా ఈ ఎన్నికల్లో టిక్కెట్ కైవసం చేసుకున్నారు.

కమ్మ సామాజిక తరగతికి చెందిన ఈశ్వరరావు బిసిలు ఎక్కువగా ఉండే నియోజకవర్గంలో పోటీ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. అయితే తమ ప్రాంతంలో కులం అనేది ఎవరూ చూడరని సేవ చేస్తామా? లేదా? అన్నదే ప్రాతిపదికగా ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు బిజెపి అభ్యర్థి ఈశ్వరరావు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతంలో ఉండే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చూస్తానని ఎన్నికల ప్రచారంలో తన వాణి వినిపిస్తున్నారు.

ఎలాంటి మలుపు తిరుగుతుందో..

మొత్తానికి టిడిపిలో విభేదాలు బిజెపి అభ్యర్థికి కలిసివచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఎచ్చెర్ల టిక్కెట్ కోసం ప్రయత్నించిన ఇద్దరు నేతలకు అధిష్టానం న్యాయం చేయడంతో ఎచ్చెర్లలో బిజెపి వెంట నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు తాము ఎంత వ్యతిరేకించినా అధిష్టానం ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కే రెండోసారి టిక్కెట్ ఇవ్వడంతో వైసిపి నేతలు సైలెంట్ అయిపోయారు. దీంతో నియోజకవర్గంలో రాజకీయాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయనే ఉత్కంఠ రానురానూ ఎక్కువవుతోంది.

కాంగ్రెసేతర పార్టీలదే హవా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



ఇచ్ఛాపురం నియోజకవర్గం గత చరిత్ర పరిశీలిస్తే 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలో కేవలం మూడుసార్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన అన్ని ఎన్నికలో కాంగ్రెస్‌కి వ్యతిరేక పార్టీలు విజయం సాధించారు. 1952లో కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా హరి హర పట్నాయక్ సమీప ప్రత్యర్థి నీలాద్రిరెడ్డిపై తొలి విజయం సాధించారు. 1956 ఉప్పాడ రంగబాబు సమీప ప్రత్యర్థి హరిహర పట్నాయక్‌పై విజయం సాధించారు. 1962లో మొదటి సారిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కీర్తి చంద్ర దేవ్ సమీప ప్రత్యర్థి పీతాంబర రెడ్డిపై అనూహ్య విజయం సాధించారు. 1967 లండ కారయ్యరెడ్డి సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కీర్తి చంద్ర దేవ్‌పై స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. 1972.లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉప్పాడ రంగబాబు సమీప ప్రత్యర్థి బెందాళం వెంటకశర్మపై గెలుపు సాధించారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా బెందాళం వెంకటశర్మ సమీప ప్రత్యర్థి కాళ్ల బలరాంపై విజయం సాధించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు ఒకరకంగా జరిగితే... రాష్ట్రంలో టిడిపి ఆవిర్భావం నుంచి కూడా కేవలం ఒక్కసారి 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా నరేష్ కుమార్ అగర్వాల్ (లల్లూ) విజయం సాధించారు. 1983లో టిడిపి అభ్యర్థిగా ఎం.వి.కృష్ణారావు 9 వేలు మెజారిటీ, 1985లో ఎం.వి.కృష్ణారావు 35 వేలు రికార్డుస్థాయి మెజారిటీతో విజయం సాధించారు. అదేవిధంగా 1989లో ఎం.వి.కృష్ణారావు 17 వేలు మెజారిటీ, 1994లో టిడిపి అభ్యర్థిగా దక్కత్ అచ్యుతరామరెడ్డి 13 వేలు మెజారిటీ, 1999లో మళ్లీ ఎం.వి.కృష్ణారావు 4,500 మెజారిటీ, 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరేష్ కుమార్ అగర్వాల్ అఖండ విజయం సాధించారు. 2009లో టిడిపి అభ్యర్థిగా పిరియా సాయిరాజ్ 3 వేలు మెజారిటీతో గెలుపొందారు. 2014లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన బెందాళం అశోక్ 25.278 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికలో మళ్లీ టీడిపి అభ్యర్థిగా బెందాళం అశోక్ 7,474 వేలు మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం మీద అన్ని ఎన్నికలు ఫలితాలు చూస్తే కాంగ్రెసేతర పార్టీలకు ఆదరిస్తున్నట్లు కనిపిస్తుంది. తాజాగా జరగనున్న ఎన్నికల్లో టిడిపి కంచుకోట బద్దలు కొట్టి వైసిపి జెండా నిలబెట్టేందుకు శత విధాలుగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

వ్యూహాత్మకంగా ప్రచారాలు

ప్రచారం చేస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో శ్రీకాకుళం నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ నియోజకవర్గంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వైసిపి అభ్యర్థిగా బరిలో కొనసాగుతుండగా, టిడిపి కూటమి నుంచి కొత్త అభ్యర్థి గొండు శంకర్ ఈసారి బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గుండ లక్ష్మీదేవికి అన్నీతానై వ్యవహరించి ఎన్నికల నిర్వహణలో అనుభవాన్ని సంపాదించుకున్న ఆయన వ్యూహాత్మగానే టిక్కెట్టు సాధించారు. అభ్యర్థులిద్దరి మధ్య దగ్గరి బంధుత్వమే ఉన్నా... రాజకీయంగా సుదీర్ఘకాలం నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలున్నాయి. రాజకీయంగా నియోజకవర్గంలో పట్టు సాధించి విజయాన్ని సొంత చేసుకోవాలన్న పట్టుదలతో కూటమి అభ్యర్థి గొండు శంకర్ ప్రయత్నాలు చేస్తుంటే... మరోమారు తిరిగి విజయాన్ని సాధించాలన్న పట్టుదలతో వైసిపి అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు వ్యూహాలు రచిస్తున్నారు. అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచార బాధ్యతలను కుటుంబ సభ్యులే భుజాన కెత్తుకున్నారు. మంత్రి ధర్మాన తరపున ఆయన సతీమణి గజలక్ష్మి, కుమారుడు రాంమనోహర నాయుడు ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గొండు శంకర్ తరపున ఆయన సతీమణి గొండు స్వాతి శంకర్, తండ్రి మాజీ ఎంపిపి గొండు జగపతిలు పెద్దఎత్తున ప్రచారం కొనసాగిస్తున్నారు. పోటాపోటీగా ఈ రెండు కుటుంబాలు శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. గార, శ్రీకాకుళం మండలాల్లో కుటుంబ సభ్యులు ప్రచారం సాగిస్తుంటే.. అభ్యర్థులిద్దరూ వ్యూహాత్మకంగా నగరంలో ప్రచారం సాగిస్తున్నారు. తరగతుల వారీగా మంత్రి ధర్మాన సమావేశాలు నిర్వహిస్తుంటే... గొండు శంకర్ నేరుగా ఇంటికి వెళ్లి నాయకులను కలుస్తున్నారు. ఈ నెల 25న ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న గొండు శంకర్ (ఫైల్)

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రచారం చేస్తున్న రవికుమార్

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో 15, 13 వార్డులు గణేష్ నగర్, విద్యానగర్‌లో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచకం, అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్‌ను ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరపునాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మాజీ కౌన్సిలర్లు తమ్మినేని విద్యాసాగర్, కణితి విజయలక్ష్మి భాయ్, గురుగుబెల్లి నాగేశ్వరరావు, పుట్రేపు ప్రసాద్, అన్నెపు సత్యం పాల్గొన్నారు.

ఖర్చులో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎన్నిల్లో అభ్యర్థుల వ్యయం గురించి సగటు ఓటరులో ఆసక్తికరంగా ఉంటుంది. ఎంత ఖర్చుచేయవచ్చు, ఎలా ఖర్చు చేయాలన్న విషయంపై ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు ఆచరించాలి. తాజాగా ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకావడంతో జోరుగా ఎన్నికల ఖర్చు గురించి చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎన్నికల్లో గెలుపునకు డబ్బు కీలకంగా మారింది. ఎన్నికల సంఘం నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో వ్యయ పరిమితిపై నిబంధనలు జారీచేసింది.

ఇవీ నిబంధనలు

- అభ్యర్థుల వ్యయంపై నియంత్రణలో భాగంగా నామినేషన్లు వేసే వరకు ఖర్చంతా పార్టీ ఖాతా కిందకు వస్తుంది. నామినేషను వేసిన రోజు నుంచి ఎన్నికల వ్యవ విభాగం ఖర్చంతా అభ్యర్థుల ఖాతా కిందే లెక్కిస్తుంది.
- ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ స్థానానికి రూ.28 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని ప్రకటించింది. ఈ పరిమితి దాటితే అనర్హత వేటుపడే అవకాశం ఉంటుంది.
- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి విచ్చలవిడిగా మద్యం, డబ్బులు ప్రవహించకుండా అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆధారాలు లేకుండా నగదు, బంగారం తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి నగదుతోపాటు వాహనాలు సీజ్ చేస్తున్నారు.

దీంతోపాటు ఆయా పార్టీల ఖర్చులూ లెక్కిస్తున్నారు.

- నగదు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తామంటే కుదరదు. హంగు ఆర్భాటాలు శ్రుతి మించితే అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేసే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుంది. రోజు ఖర్చు లెక్కలను నమోదు చేస్తారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేసేందుకు రిజిస్టర్ నిర్వహించాలి.
- అభ్యర్థులు ప్రచారానికి సంబందించి, సభలు, సమావేశాలు, ర్యాలీలు, భోజనాలు అంశాలను కూడా ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు.

ఐదేళ్లలో రంగులు మాత్రమే వేశారు

- **నేటికీ అసంపూర్తిగా టిడ్కో ఇళ్లు**
- **ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభోత్సవం**

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు జగ్గుశాస్త్రులపేట వద్ద నిర్మాణం జరుగుతున్న టిడ్కో పేదల గృహ సముదాయాలకు ఐదేళ్ల వైసిపి పాలనలో కేవలం రంగులకే పరిమితమైందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.48 కోట్లతో టిడ్కో సంస్థ ద్వారా పేదల గృహ నిర్మాణాలకు మంజూరు చేయగా అప్పటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సుమారు 528 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన మున్సిపల్ అధికారులు 12 బ్లాక్లుగా గృహ నిర్మాణాలు ప్రారంభించారు. 2017 నుంచి 2019 వరకు శరవేగంగా 80శాతం పనులు పూర్తిచేసిన అప్పటి టిడిపి ప్రభుత్వం 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారి రాష్ట్రంలో కొత్తగా వైసిపి ప్రభుత్వం ఏర్పడింది. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్‌గా తమ్మినేని సీతారాం ఎన్నిక కాబడినప్పటికీ ఐదేళ్ళుగా టిడ్కో ఇళ్లపై ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. లబ్ధిదారుల నుంచి కొన్ని గృహాలకు రూ.లక్ష, మరికొన్ని గృహాలకు రూ.5 వేల చొప్పున అధికారులు లబ్ధిదారుల భాగస్వామ్య నిధులు కట్టించుకొని మిగిలిన మొత్తం బ్యాంకు రుణాల ద్వారా సేకరించి గృహ లబ్ధిదారుల నుంచి ప్రతినెల చెల్లింపులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నారు. భాగస్వామి నిధులు, బ్యాంకు రుణాలు గత ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో నిధుల ఆర్థిక సహాయంతో నిర్మాణాలు పూర్తిచేసి రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ వసతులు కల్పించి ఈ గృహాలు ప్రారంభిస్తామని నమ్మ పలికారు. అయితే అధికారులు 2024 ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావిడిగా ఒక బ్లాక్‌లో ఉన్న 48 గృహాలను అంతంత మాత్రంగా నిర్మాణ పనులు పూర్తిచేసి ఇటీవల స్పీకర్ తమ్మినేని సీతారాంతో ప్రారంభోత్సవం చేయించారు. ప్రస్తుతం టిడ్కో ఇళ్ల ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి

అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలు

నిర్మాణ పనులు జరగలేదు. మౌలిక వసతుల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చొరవ చూపకపోవడంతో ప్రారంభమైన బ్లాక్‌లో కూడా లబ్ధిదారులు ఎవరూ నివాసం ఉండటం లేదు. ప్రారంభోత్సవం రోజున సమావేశంలో మాట్లాడిన సీతారాం నెల రోజుల్లో 528 మంది లబ్ధిదారులు అన్ని వసతులతో కూడిన గృహాల్లో నివాసం ఉండడమే తన లక్ష్యమని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నప్పటికీ ఎన్నికలు ఇంకో 25 రోజులు ఉండగా టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన హామీ ఏమైందని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

ప్రచారం చేస్తున్న శ్రీనివాసరావు

'పైడి' విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో శుక్రవారం స్వతంత్ర అభ్యర్థి పైడి శ్రీనివాసరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయాలు కల్పిచడంతో పాటు సాగు, తాగునీటి సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తానన్నారు. అలాగే పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఉన్న పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పైడిభీమవరంలో ఉన్న వైసిపి నాయకులు లంకలపల్లి ప్రసాదరావు, గ్రామ పెద్దలు శ్రీనివాస్, ఆనందపాత్రుడులను కలసి మద్దతు ఇవ్వాలని కోరారు.

22న తమ్మినేని నామినేషన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 22న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని సీతారాం నామినేషన్ వేయనన్నట్లు స్పీకర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 11:30 సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారని, ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

జై భారత్ ఎంపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జై భారత్ పార్టీ తరుపున జై భారత్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నామని ఎంపీ అభ్యర్థి ఇప్పిలి సీతరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌కు హాజరై తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించారు. లోక్ సభ అభ్యర్థులుగా, ఎమ్మెల్యే అభ్యర్థులుగా జై భారత్ తరపున పోటీ చేస్తున్న వారంతా విద్యాధికులు జిల్లా సమస్యలపై అవగాహన ఉన్నవారేనని చెప్పారు. రూరల్ మండలానికి చెందిన తాను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని టార్చ్ గుర్తుపై ఓటు వేసి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

24న నామినేషన్

కొత్తూరు : ఈ నెల 24న పాతపట్నం తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నామినేషన్ వేయునున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రెబల్ అభ్యర్థి కలమట వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి అధిష్టానం టిక్కెట్ నిరాకరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కూటమి నుంచి స్వతంత్ర అభ్యర్థి చెంతకు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కాలపర్తి పంచాయతీ హనుమయ్యపేటలో టిడిపి, జనసేన కూటమి నుంచి పలువురు శుక్రవారం స్వతంత్ర అభ్యర్థి గూటికి చేరారు. గ్రామానికి చెందిన బొడ్డేపల్లి పవన్, వెంకటరమణ, ముంగ తవిటి నాయుడు, బగాది అంజి, చిగురుపల్లి సింహాద్రి, రాజు, ఆనంద్‌తో మరి కొంతమంది ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ సమక్షంలో చేరారు.

పిరమిడ్ పార్టీ ఎంపీ అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఫిరమిడ్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బొమ్మాళి తిరుపతిరావు నామినేషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

విద్యార్థుల వీడ్కోలు

విద్యార్థులతో విసి రజిని, అధ్యాపకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ ఆంగ్ల విభాగంలో వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. విభాగపు జూనియర్ విద్యార్థులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్శిటీ విసి కె.ఆర్.రజని మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఆ సమయంలో తమ విజ్ఞాన సంపదను మెరుగుపర్చుకునేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంగ్లీష్ సబ్జెక్టుకు మంచి ఉపాధి అవకాశాలున్నాయని, ఆ దిశగా తమ కెరీర్‌ను మలుచుకోవాలన్నారు. వర్శిటీ రెక్టార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఆంగ్ల విభాగపు అధ్యాపకులు డా.బి.వి.రమణమూర్తి, డా.పి.రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి బి-ఫారం అందజేత

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావుకు కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీ బిఫారాన్ని శుక్రవారం అనంతపురం జిల్లా ఉరవ కొండలో అందజేసినట్టు మల్లేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా పోరాటం చేస్తుందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మంచి మద్దతు వస్తుందన్నారు. త్వరలోనే ఎచ్చెర్ల కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు.

షర్మిల నుంచి బి-ఫారం అందుకుంటున్న మల్లేశ్వరరావు

ఇంటింటా ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం

వైసిపి విజయం ఖాయం

ప్రజాశక్తి- బూర్జ

దుష్టశక్తులన్నీ ఏకమైనప్పటికీ అంతిమ విజయం వైసిపిదేనని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని లచ్చయ్యపేటలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక పార్టీలన్నీ ఏకమయ్యాయన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కూటములుగా ఏర్పడిన సాధించేది ఏమీ లేదన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి ఎన్నికల హామీలను వివరించారు. కార్యక్రమంలో టిట్కో డైరెక్టర్ గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపిలు సూర్యారావు, కృష్ణంనాయుడు, కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగేశ్వరరావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: కూటమి పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని జొన్నవలసలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేర్చిన వైసిపిని మరోసారి ఆదరించి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ప్రతిపక్షాలకు లేదని, అధికారం కోసం తోడేళ్ల గుంపులా వస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం

బూర్జ : సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాలవలస, తుడ్డలి, లక్కుపురం, అల్లెన, కిలంతరి గ్రామాల్లో టిడిపి, జనసేన మండల నాయకులు ఆయా గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి అనెపు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబు నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, సర్పంచ్ అంపిలి గణపతిరావు, ముదిలివలస రమేష్, పీరుకట్ల ప్రభాకరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్‌కు మద్దతుగా హరిపురం, బొడ్డకాళి, మున్సిపాలిటీ పరిధిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లొల్ల రాజేష్, దక్కత ఢిల్లీరావు, మంగి లక్ష్మి, దక్కత శ్రీను, కామేశ్వరరావు, ఎస్.సహదేవ్, ఎల్.పద్మనాభవం పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

బిసివై అభ్యర్థి ప్రసాద్ నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శాసనసభ నియోజకవర్గ బిసివై అభ్యర్థిగా పెద్దపాడుకు చెందిన సాలిన ప్రసాద్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న నియోజకవర్గ ఆర్ఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సిహెచ్ రంగయ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు.

నామినేషన్ అందజేస్తున్న ప్రసాద్

రిసార్ట్స్‌ను ప్రారంభించిన 'దానేటి'

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కుశాలపురం వద్ద నిర్మించిన సెలెబ్రేషన్స్ రిసార్ట్స్‌ను ప్రముఖ వైద్య నిపుణులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఆయనతో పాటు డాక్టర్ గూడేన సోమేశ్వరరావు హాజరై రిసార్ట్ గదులు, ఇతర సౌకర్యాలను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వాలన చేశారు. యాజమాన్యం వైద్యులను శాలువ కప్పి సత్కరించారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుల తనిఖీ

ఇచ్ఛాపురం : రికార్డులను పరిశీలిస్తున్న నవీన్ కుమార్ సోని

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా నియమించిన వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోని శుక్రవారం తనిఖీ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం కేంద్రం ప్రారంభం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర, ఇతర ఎన్నికల విధులు నిర్వహించే అధికార యంత్రాంగంతో సమీక్షించారు. ఇచ్ఛాపురంలో ఇంతవరకు ఎన్ని పర్మిషన్లు ఇచ్చారు, వాటి ఖర్చు వివరాలు సేకరణ, అక్రమ డబ్బు, మద్యం పంపిణీపై నిఘా, ఇతర తనిఖీ బృందాలతో సమావేశం నిర్వహించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈయన వెంట ఎన్నికల నామినేషన్ భద్రత అధికారి గంగాధర్, ఎఆర్‌ఒ అప్పారావు, డిటి శ్రీహరి, సిఐ ఇమ్మ్యానుయేల్‌రాజు, ఎస్‌ఐ సత్యనారాయణలున్నారు.

పలాస : పలాస ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోని పరిశీలించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో పలాస ఎన్నికల అధికారి భరత్ నాయక్‌తో చర్చించారు. ఇప్పటి వరకూ ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, వారి వ్యయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలాస, టెక్కలి, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న గౌతు శిరీష

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తనకు అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పలాస టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని కొత్తపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు అవసరం రాష్ట్రానికి ఉందని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు పుచ్చ శోభారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, పాపారావు పాల్గొన్నారు.

నామినేషన్ వేస్తున్న త్రినాథ్‌బాబు

త్రినాథ్‌బాబు నామినేషన్

ప్రజాశక్తి- పలాస

పలాస కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మజ్జి త్రినాథ్‌బాబు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు అందజేశారు. ఆయనకు దువ్వాడ జీవితేశ్వరరావు బలపరిచారు. డమ్మీ కూడా మజ్జి త్రినాథ్‌బాబు నామినేషన్ వేశారు. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, వివిధ ప్రజా సంఘాల పార్టీల ఆధ్వర్యాన త్రినాథ్‌బాబు నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోనారి మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు ఎన్.గణపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ వేస్తున్న గౌతు శిరీష

నిరాడంబరంగా శిరీష నామినేషన్

పలాస : టిడిపి అభ్యర్థి గౌతు శిరీష ఉదయం 11.30 గంటలకు నామినేషన్ వేయగా, డమ్మీగా గౌతు శివాజీ 12 గంటలకు నామినేషన్ వేశారు. గౌతు శిరీషకు వజ్జ గంగా భవాని, సూరడ భారతి, దాసరి జయలక్ష్మి బలపరిచారు. గౌతు శిరీష, శివాజీ ఎటువంటి ఆర్భాటం లేకుండా నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలపై తొలిసంతకం చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు అందజేశారు.

టిడిపి నాయకుల పరామర్శ

పలాస: మండలంలోని కిష్టుపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, టిడిపి సీనియర్ నాయకులు బూరెల జగ్గారావు మాస్టర్ ఇటీవల మృతి చెందారు. విషయం విషయం తెలుసుకున్న టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మృతుడు కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. మృతుడు కుమారులు టిడిపి శ్రీశయన రాష్ట్ర నాయకులు బూరెల కృష్ణంరాజు, టిడిపి ఐటిడిపి రాష్ట్ర నాయకులు బూరెల విజయ, కృష్ణంరాజు పాల్గొన్నారు. ముందుగా జగ్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

పోర్టుతో వలసల నివారణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకారుల వలసలు నివారణకు వైసిపి ప్రభుత్వ హయంలో నూతనంగా పోర్టులు జట్టీలు నిర్మాణం చేపట్టామని మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని మంచినీళ్లపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సిఎం జగన్ మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించారని అన్నారు. మత్స్యకారుల కోసం వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు.

అప్పలరాజుకు హారతి ఇస్తున్న వృద్ధురాలు

కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి వంక రాజు, సర్పంచ్ సత్యారాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్ని శ్రీను, ఎంపిటిసి ఉపేంద్ర, గొరకాల రామారావు పాల్గొన్నారు.

వైసిపి కండువా వేస్తున్న సాయిరాజ్

వైసిపిలోకి భారీగా చేరికలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో బిజెపిలో వివిధ పదవుల్లో ఉన్న 200 కుటుంబాలు మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రతినిధి చాట్ల తులసీదాస్ నేతృత్వంలో వైసిపిలోకి చేరారు. వీరికి బెల్లుపడ కాలనీలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ శుక్రవారం వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో బిజెపి నాయకులు బంగారు ధనుంజయ, బోర తులసీరావు, పరమేశ్వరరావు, భాగ్యలక్ష్మి, కుమారి, జగన్నాయకులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆకర్షితులై అనేక మంది వైసిపిలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు భారతి దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డు కౌన్సిలర్ ప్రదీప్, కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, కాళ్ల సత్యం, పిలకా సంతోష తదితరులు పాల్గొన్నారు.

పూలమాలతో సన్మానిస్తున్న వైసిపి నాయకులు

తిలక్‌కు ఘన స్వాగతం

కోటబొమ్మాళి: శ్రీకాకుళం పార్లమెంట్ వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్‌కు మసాహెబ్‌పేట, కిష్టుపురం, తాటిపర్తి తదితర పంచాయతీలకు చెందిన నాయకులు శుక్రవారం కిష్టుపురం కూడలి వద్ద ఘనస్వాగతం పలికారు. శ్రీకాకుళంలో ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్తున్న తిలక్‌కు మార్గంమధ్యలో ఈ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మాసాహెబ్‌పేట సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి, ఎఎంసి ఉపాధ్యక్షులు బొడ్డ వెంకటరావు, తాటిపర్తి సర్పంచ్ ప్రతినిధి రెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి- పలాస

సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తామని, ఆయన క మారుడు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. గౌతు లచ్చన్న 18వ వర్థంతి సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం సంస్మరణసభ నిర్వహించారు. ముందుగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న శివాజీ

నివాళ్లర్పించారు. స్వతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ వేత్తగా ఎన్నో పదవులు అలంకరించిన లచ్చన్నను నేటి రాజకీయ నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, గౌతు విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కొండే నర్సింహులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

టిడిపిలో పలువురు చేరిక

నౌపడ: సంతబొమ్మాళి మండలం హనుమంతు నాయుడుపేట పంచాయతీకి చెందిన పలువురు కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవనంలో ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. పంచాయతీ నుంచి బుడ్డెపు సోమేశ్, పరపటి లక్ష్మణరావు, సీరపు భాస్కరరావు, కోళ్ల చిట్టిబాబుతో పాటు మరో 10 కార్యకర్తలు చేరిన వారిలో ఉన్నారు. వీరికి అచ్చెన్నాయుడు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నౌపడ పంచాయతీ నుంచి బుడ్డెపు తేజారెడ్డి, బొమ్మాళి రమణ టిడిపిలో చేరారు. రానున్న ఎన్నికల్లో అచ్చెన్నాయుడుతో కలిసి నడుస్తామని అన్నారు.

మాట్లాడుతున్న జడ్జి చక్రవర్తి

కేసుల పరిష్కారానికి కృషి

పలాస : వచ్చే నెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎన్వెన్ఆర్జ చక్రవర్తి కోరారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఎక్కువగా క్రిమినల్ కేసులు పరిష్కారం చేయడానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.విశ్వేశ్వరరావు, వి.రవి, ఘని, ప్రభాకరరావు, అనిల్ రాజు, దేవరాజ్ పాల్గొన్నారు.

శ్యాంపురియా మృతి

ప్రజాశక్తి- కవిటి

బెంతు ఒరియాల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ పురియా(65) శుక్రవారం వేకువజామున మృతి చెందారు. అప్పట్లో కాంగ్రెస్, ప్రస్తుత వైసిపిలో కీలక పాత్ర పోషించారు. ఇచ్ఛాపురం ఎఎంసి అధ్యక్షుడుగా, కవిటి పిఎసిఎస్ అధ్యక్షుడుగా తన సేవలు అందించారు. ఆయన భార్య సావిత్రి పురియా ప్రస్తుతం వరక సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. శ్యామ్ పురియాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వైసిపి

పాడె మోస్తున్న సాయిరాజ్, ప్రకాష్

నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకుని నివాళ్లర్పించారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆయన పాడెమోసి కంటతడి పెట్టారు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 187 మంది విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ రోజు ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుం దని, ఒకవేళ ఎవరైనా విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోకపోతే ముందుగా వివరాలతో పాటు పాఠశాల వద్దకు వచ్చి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

చీడివలసలో ప్రబలుతున్న వ్యాధులు

- కలుషిత నీరే కారణమన్న గ్రామస్తులు
- తాండవిస్తున్న అపారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని చీడివలసలో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ ఒకరు, ఇద్దరు రకరకాల శారీరక సమస్యలతో సతమత మవుతున్నారు. సమస్యను వివరిస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చీడివలసలో గత వారం రోజులుగా ప్రతి ఇంటిలోనూ విష

జ్వరంతో బాధపడుతున్న రూన్నీ, ఈశ్వరమ్మ

జ్వరాలు, మోకాలు, ఒళ్లు పట్లు, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. గ్రామంలో సుమారు 1200 మంది జనాభా ఉన్నారని, గ్రామానికి అవసరమైన తాగునీరు మోటారు ద్వారా అధికారులు సప్లై చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే గతవారం రోజులుగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, నీరు కలుషితం కావడం వల్లే వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, గ్రామంలో సుమారు 70శాతం మంది వివిధ వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ విషయాన్ని ఎంపిడిఒకు ఇఒపిఆర్‌డి, కార్యదర్శికి కూడా తెలియజేసినప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలో ఐదు హ్యాండ్ బోర్లు ఉన్నప్పటికీ అవి మరమ్మతులకు గురయ్యాయన్నారు. పైపులైన్ ద్వారా వస్తున్న తాగునీరు తప్ప వేరే గత్యంతరం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో అపారిశుధ్యం నెలకొందని, పాలకవర్గంగాని, అధికారులుగాని పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చెరుపల్లి రూన్నీ,

నెయ్యిలవీధిలో అపారిశుధ్యం మధ్య కుళాయి

దొరుపల్లి ఈశ్వరమ్మ, దొరగాని రాంబాబు, కొండూరు పార్వతి, సిహెచ్ వెంకటమ్మ, భవాని, కొండూరు చంద్ర, సన్యాసితో పాటు పలువురు వివిధ సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం గ్రామానికి చెందిన అమలాపురం రాజేశ్వరి అనే మహిళకు వాంతులు, విరోచనాలు ఎక్కువగా కావడంతో 108 ద్వారా పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గ్రామంలో ఉన్న పరిస్థితిని వైద్య అధికారులకు తెలియజేయగా తాగునీరు కలుషితం కావడం వలనే వ్యాధులు ప్రబలుతున్నాయని చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఏదిఏమైనా గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు చోద్యం చూస్తున్నారు తప్పా పట్టించుకునే నాధుడే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా కలుషితమైన తాగునీరు సరఫరా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మోటారు సమీపంలో ఉన్న బురద

తాగునీరు కలుషితం అవుతుంది

తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలుతున్నాయి. వేరే గత్యంతరం లేక నీటిని అన్ని రకాలుగా ఉపయోగిస్తున్నాం. అధికారులు చర్యలు చేపట్టాలి

- కందూరు సుధ, చీడివలస

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్నాయి. తాగునీరు కలుషితం అవుతుంది. సంబంధిత అధికారులకు వివరించి నప్పటికీ పట్టించు కోవడం లేదు. తమ గ్రామ సమస్యను జిల్లా కలెక్టర్‌కు వివరిస్తాం.

- సూరిపల్లి సాంబమూర్తి, చీడివలస

నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రవికుమార్

రవికుమార్ నామినేషన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ఉమ్మడి అభ్యర్థిగా టిడిపి నుంచి కూన రవికుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. రవికుమార్‌తో పాటు ఆయన సతీమణి, పొందూరు మాజీ ఎంపిపి కూన ప్రమీల చెరో రెండు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు సమర్పిం చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లా డుతూ ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ రోజు నామినేషన్ వేయడం జరిగిందని, ఈనెల 23న ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో కలిసి వారందరి సమక్షంలో మరో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, తమ్మినేని విద్యాసాగర్, బివి రమణమూర్తి, ఢిల్లీశ్వరరావు, నూక రాజు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా తిలక్ నామినేషన్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి శు క్రవారం వైసిపి అభ్యర్థిగా పేరాడ తిలక్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజక వర్గాల నుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. వివిధ వాహనాల్లో తరలి రావడంతో 80 అడుగుల రోడ్డు కిక్కిరిసి పోయింది. ముందుగా ఆనంద మయి ఫంక్షన్ హాల్‌కు అభిమానులు, కార్యకర్తలతో చేరుకున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవిన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు, పశు సంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయలు అక్కడి చేరుకున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు ర్యాలీగా వెళ్లారు. రెండు సెట్లు నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలాని సమూన్‌కు అందజేశారు. ఆయనను మొదటి దఫా కృష్ణదాస్ బలపరిస్తే, రెండో దఫా పత్రాలకు ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ బలపర్చారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో తిలక్ విలేకరులతో మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో అభ్యర్థిగా టిక్కెట్టు ఇచ్చిన సిఎం జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- లావేరు

ఆరోగ్యంపై ప్రతిఒక్కరు శ్రద్ధ వహించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ ప్రసాద్ అన్నారు. శుక్రవారం బుడతవలసలో ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం ఎండలు, వేడిగాలులకు ప్రతిఒక్కరు బయట పనులు మీద వెళ్లేవారు తలకు టోపీలు ధరించాలని, తాగునీరు చెంతనే ఉంచుకోవాలని, మజ్జిగ, నిమ్మరసం తరుచుగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 308 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 300మందికి లాబ్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో లావేరు పిహెచ్‌సి వైద్యాధికారులు జె.మౌనిక, బొర మాధవి, ఎన్.అశోక్‌కుమార్, పిహెచ్ఎన్ఎం సుహాసిని, ఎఎన్ఎం ఎచ్చెర్ల భవాని, వైద్య సిబ్బంది బెనర్జీ, కె.భవాని, 108 సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ ప్రసాద్

కృపారాణి నామినేషన్

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్

టెక్కలి నియోజకవర్గం ప్రజలు తెలివైన వారిని, మేలు విత్తనాలను ఎంచుకోవడంలో ప్రజలు తెలిసని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా శు క్రవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ పత్రాన్ని

నామినేషన్ వేస్తున్న కృపారాణి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని, ఈ నియోజకవర్గానికి తాగునీరు మంజూరు చేశానని అన్నారు. టిడిపి ఆ పథకాన్ని ఒక గ్రామ పంచాయతీకి పరిమితం చేసి 97 గ్రామాలను విడిచిపెట్టారని అన్నారు. వైసిపి, టిడిపి కేంద్రంలో బిజెపి మద్దతు ఇచ్చి ఈ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ కాకుండా కాపాడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. నాలుగు మండలాలతో నాయకులతో, కార్యకర్తలతో సత్సంబంధాలు ఉన్నాయని, తన అభివృద్ధి తమకు గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనకు కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిదని, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, వైఎస్ షర్మిల నాయకత్వంలో పనిచేసి ఈ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతామని అన్నారు.

నామినేషన్ వేస్తున్న శ్రీనివాస్

అట్టహాసంగా 'దువ్వాడ' నామినేషన్

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్

టెక్కలి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్‌ను గెలిపిస్తే జగనన్నకు చెప్పి హోంమంత్రి చేయిస్తానని వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం స్థానిక వెంకటేశ్వర ఆలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24న జరిగే సిద్ధం సభలో జగనన్నకి చెప్పి హోంమంత్రిగా చేయిస్తారని అన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయితే టెక్కలి పారిశ్రామిక వాడగా మారుతుందని తెలిపారు. నాలుగుసార్లు ఎమ్మెల్యే గెలిచి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నియోజకవర్గంలో ఏమి చేశారని ప్రశ్నించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.4,200 కోట్లతో మూలపేట పోర్టు వైసిపి హయాంలో నిర్మిస్తున్నామని అన్నారు. నాడు-నేడుతో పాఠశాలలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల అభివృద్ధి టిడిపి నాయకులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా చౌకబార్ ఆరోపణలు మానలన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, ఎర్ర చక్రవర్తి, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. అనంతరం దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరల్ కమర్‌కు అందించారు. వీరితోపాటు పార్టీ నాయకులు ఎర్ర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

కోటబొమ్మాళి: బోయిన గోవిందరాజులు ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పారిశ్రామికవేత్త, టిడిపి సీనియర్ నాయకులు బోయిన గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో బిపి, సుగర్, ఇసిజి, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. వైద్యుల సలహామేరకు ఆపరేషన్లకు అవసరమయ్యే వారికి జెమ్స్ ఆస్పత్రికి తరలిస్తారని అన్నారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ మళ్లింపుతో ప్రజలకు ఇక్కట్లు

కాలినడకన వెళ్లే వారినీ అడ్డుకున్న వైనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికల విధుల్లో భాగంగా స్థానిక పోలీసులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లు తహశీల్దార్ కార్యాలయంలో జరగ నున్న దృష్ట్యా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసి తహశీల్దార్ కార్యాలయ రహదారిలో బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. పట్టణ ప్రధాన రహదారి నుంచి వెళ్లే ఈ రహదారిలో ప్రధాన తపాలా కార్యాలయం, సబ్ రిజిస్టర్, ఐకెపి, ట్రెజరీ, ఐసిడిఎస్, డిగ్రీ కళాశాల, ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయాలకు ఉద్యోగులు, ప్రజలు వెళ్ళాల్సి ఉంది. అలాగే పూజారిపేట, మోణింగివారి వీధి, పాతినవారి వీధి, కొత్తకోటవారి వీధి, ఐజె నాయుడు కాలనీకి చెందిన ప్రజలందరూ రైల్వే స్టేషన్, ప్రధాన మార్కెట్ కు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే పోలీసులు స్థానిక ఎస్ఎస్ఎన్ కళ్యాణమండపం వద్ద రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్ మళ్లింపు బోర్డులను ఏర్పాటు చేసి వాహనాలను ఆపడం నిబంధనలు అయినప్పటికీ ద్విచక్ర వాహనాలు, సైకిళ్ళు, కాలినడక వెళ్లే ప్రజలను కూడా తీవ్రమైన ఎండలో నిలుపుదల చేసి దారి మళ్లింపు చర్యలు చేపట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలో 100 మీటర్ల ప్రయాణించి ప్రభుత్వ కార్యాలయాలకు, వారి నివాస స్థలాలకు చేరుకోవాల్సిన ప్రజలు పోలీసులు పెట్టిన అనాలోచిత చర్యలతో

వాహనాలను నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సుమారు కిలోమీటర్ దూరం ప్రయాణించి గమ్య స్థానాలకు చేరుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి ఒకవైపు రహదారిలో ఇటువంటి నిబంధనలు అమలు చేస్తూ పోలీసులు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సరుబుజ్జిలి ఎస్ఐ బి.నిహార్‌ను దారివిడిచి పెట్టమని ఎంత వేడుకున్నా కనికరించలేదని, తమతో వారనకు దిగి ఎండలోనే పదినిమిషాల పాటు నిల్చోపెట్టి ఇబ్బందులకు గురిచేశారని పూజారిపేటకు చెందిన గురుగుబెల్లి శంకర్, సీపాన ఉమ మరికొంత మంది మహిళలు వాపోతున్నారు. ముఖ్యంగా ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపం వద్ద విధులు నిర్వహిస్తున్న సరుబుజ్జిలి ఎస్ఐ రహదారిలో వస్తున్న ప్రజలపై ఎన్నికల విధులు అంటూ వింత పోకడలతో ప్రదర్శిస్తున్న తీరును పలు విమర్శలకు దారితీస్తున్నది. ఇప్పటికైనా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ రహదారిలో పోలీసులు చేపట్టిన దారి మళ్లింపు చర్యలను సమీక్షించి ప్రజలకు ఎటువంటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.